క్లుప్తంగా

ఫిబ్రవరి 3 నుంచి రథ సప్తమి వేడుకలు



రథసప్తమి పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఉరవకొండ: రాష్ట్రంలోనే రెండో సూర్యదేవాలయంగా ప్రసిద్ధి చెందిన బూదగవి సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఫిబ్రవరి 3 నుంచి రథసప్తమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆదివారం ఆలయ ఆవరణలో పోస్టర్లను విడుదల చేశారు. ఆలయ కమిటీ చైర్మన ఛత్రగుడి చిరంజీవి, మహేంద్రగౌడ్, ఛత్రపతి సుధాకర్, కృష్ణమోహన్, ఎంపీటీసీ రామస్వామి మాట్లాడారు. బూదగవి సూర్యదేవాలయంలో వచ్చే నెల 3 నుంచి 4వ వరకు సప్తమి ఉత్సవాలు జరుగుతాయన్నారు. 3న ప్రత్యేక హోమాలు, 4న సూర్యనారాయణస్వామి, ఛాయ ఉషా అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

నేటి నుంచి చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



చౌడేశ్వరిదేవి మూలవిరాట్

రాయదుర్గం టౌన్: పట్టణంలోని నేసేపేటలో వెలసిన చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శివరుమాళ్ల కృష్ణమూర్తి, మద్దిలేటి ప్రభాకర్ మాట్లాడుతూ తెల్లవారు జామున 5 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయని, సాయంత్రం 5 గంటలకు గంగపూజ ఉంటుందన్నారు. 21న తెల్లవారుజామున నవ జ్యోతుల ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. 22న రాత్రి నెలపూజతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

నేడు శాంతలింగేశ్వర స్వామి జాతర

బ్రహ్మసముద్రం : ముప్పలకుంటలో ముమ్మడి శాంతలింగేశ్వర స్వామి అనుష్టానం చేసి 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం జాతర నిర్వహిస్తున్నారు. జాతరకు కేధార్‌నాథ్ ఆస్థాన స్వామీజీ నాల్వడి శాంతలింగేశ్వర స్వామి రానున్నారు. సోమవారం ఉదయం నుంచి స్వామి శాంతలింగేశ్వర స్వామి తపోక్షేత్రంలో పూజలు నిర్వహించి, మహా కుభాభిషేకం, గ్రామోత్సవం, ధ్వజారోహణం, విశేష పూజల అనంతరం అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ ఆకస్మిక మృతి



జర్నలిస్ట్ పురుషోత్తం (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: సుదీర్ఘకాలంగా పని చేస్తున్న పాత్రికేయుడు పురుషోత్తం (50) ఆదివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. నియోజకర్గంలో పలు చానళ్లలో 20 ఏళ్లకు పైగా పనిచేశారు. ఈయన ప్రస్తుతం ఆర్‌టీవీ ఛానల్ రిపోర్టర్‌గా పనిచేస్తుండేవాడు. మృతుడు పురుషోత్తంకు భార్య పుష్ప, ఇంటర్ చదువుతున్న కొడుకు, కూతురు ఉన్నారు.

ఘనంగా అంబిగరచౌడయ్య జయంతి



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు: మండల కేంద్రంలో బారిక కులస్తుల ఆరాధ్యదైవం అంబిగర చౌడయ్య జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. అంబిగర చౌడయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన చిత్రపటాన్ని ప్రత్యేక రథంలో ఉంచి ఊరేగించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులతోపాటు మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



జూదరుల అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ నబీరసూల్

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు పొలాల్లోని కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,500 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు.

నియోజకవర్గంలో రహదారులు ఛిద్రం కావడంతో ప్రయాణం నరకమైంది. రోడ్లు కంకర తేలి అస్తవ్యస్తంగా మారడంతో పొరుగూళ్లకు వెళ్లాలంటే అవస్థలు పడక తప్పలేదు. అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకునేవారు కరువయ్యారు. ఇటీవల కూటమి సర్కారు రోడ్ల మరమ్మతుల పేరుతో ప్యాచ్ వర్క్‌లు చేసినా ఫలితం లేకపోయింది. పలుచోట్ల నాసిరకంగా పనులు చేపట్టడంతో కంకర తేలి అధ్వానంగా మారాయి. – కళ్యాణదుర్గం:



మంత్రి పయ్యావుల కేశవ్ ఇలాకాలోని గంగవరం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం

- కంకర తేలి అస్తవ్యస్తంగా మారిన రహదారులు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- అతుకుల గతుకులతో ప్రయాణంతో బేజారు

కళ్యాణదుర్గం – కంబదూరు ప్రధాన రహదారి ఛిద్రమైంది. స్థానిక కంబదూరు బైపాస్ రోడ్డులో పలుచోట్ల రోడ్డు కంకర తేలి అస్తవ్యస్తంగా మారింది. రోడ్డు మరమ్మతు పేరుతో ప్రభుత్వం చేపట్టిన పనులను కాంట్రాక్టర్ నాసిరకంగా వేయడంతో ప్రధాన రహదారి కోతకు గురై వాహనదారులకు కష్టంగా మారింది. స్థానిక గోల్డెన్ బెల్స్ హైస్కూల్ సమీపంలోనూ, ఏపీ మోడల్ పాఠశాల వద్ద ప్యాచ్ వర్కులు చేసినా ఫలితం లేకపోయింది.

» ఇది కళ్యాణదుర్గం నుంచి బోరంపల్లి మీదుగా బెళుగుప్పకు వెళ్లే ప్రధాన రహదారి. ఈ రోడ్డు గుంతలు మయంగా, కంకర తేలి అస్తవ్యస్తంగా మారింది. స్వయానా ప్రస్తుత ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఉరవకొండ నియోకజకవర్గంలోని బెళుగుప్ప మండలం గంగవరం క్రాస్ నుంచి బెళుగుప్ప వరకు సుమారు 15 కిలో మీటర్ల దూరం ఉంటుంది. గతంలో పయ్యావుల కేశవ్ ఎమ్మెల్యేగా పని చేసినప్పటి నుంచి ఈ రోడ్డు దుస్థితి ఇలాగే ఉంది. ఈ రోడ్డు బాగోగులు పట్టించుకునేవారు కరువయ్యారు. గుంతల మయంగా కంకర తేలిన రోడ్లపై వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు.

» ఇదిగో ఇక్కడ కంకర తేలి రాకపోకలకు అంతరాయంగా ఉన్న రోడ్డు కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కుందుర్పి మండలం లోనిది. అపిలేపల్లి గ్రామం నుంచి మందలపల్లికి వెళ్లాలంటే సుమారు 6 కిలో మీటర్ల మేర నరకయాతన పడాల్సిందే. వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ గమ్యస్థానాలకు చేరుకుంటారు. రాత్రి సమయాల్లో రోడ్డు సరిగాలేక పలువురు కింద పడి గాయాలతో ఆసుపత్రికి పాలైన ఘటనలూ ఉన్నాయి. అయితే రోడ్డు బాగు చేయాల్సిన అధికారులు, పాలకులు అటువైపు కన్నెత్తి చూడడంలేదు.

» ఇక్కడ తారురోడ్డుకు నోచుకోని రోడ్డు కంబదూరు మండల పరిధిలోని ఐపార్శపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి. మట్టిరోడ్డుపైనే ప్రజలు ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. పలుమార్లు రోడ్డు బాగు చేయాలని విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో మట్టిరోడ్డుతోనే కాలం వెల్లదీస్తున్నారు.



కంకర తేలిన కుందుర్పి మండలం అపిలేపల్లి నుంచి మందల పల్లికి వెళ్లే ప్రధాన రహదారి



కళ్యాణదుర్గం: నాసిరకంగా గుంతలు పూడ్చడంతో ఏపీ మోడల్ పాఠశాల వద్ద కంకరతేలిన రోడ్డు



తారు రోడ్డుకు నోచుకోని కంబదూరు - ఐపార్శపల్లి రోడ్డు

అతుకుల గతుకులతో అవస్థలు



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులలో నాణ్యతలేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళ్యాణదుర్గం, కంబదూరు ప్రధాన రహదారిలో పలుచోట్ల ప్యాచ్ వర్కులు చేసినా నాణ్యతగా లేకపోవడంతో కంకర తేలింది. చేట్టిన మరమ్మతు పనులు పూర్తిగా నాణ్యతతో చేయాలి. దీనిపై అధికారులు పర్యవేక్షించి రోడ్లు బాగుండేలా చర్యలు తీసుకోవాలి.

– గోపారం శ్రీనివాసులు, కళ్యాణదుర్గం

తవ్వారు.. వదిలేశారు



ప్రభుత్వం రోడ్డు ప్యాచ్ వర్కులు చేయించినా నాణ్యతలేక ప్రయోజనం లేకపోయింది. శెట్టూరు మండలంలో ఎక్కడా ప్యాచ్ వర్కులు జరగలేదు. శెట్టూరు, అయ్యగార్లపల్లి ప్రధాన రోడ్డుపై ఉన్న గుంతలను ప్యాచ్ వర్కుల కోసం రోడ్డును తవ్వారు. అలానే వదిలేశారు. పనుల కోసం నెల రోజుల క్రితమే రోడ్డు తవ్వి, పనులు మాత్రం నిర్వహించలేదు. దీంతో రోడ్డు మరింత ధ్వంసమైంది. ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

– టైలర్ వన్నూరుస్వామి, శెట్టూరు

ఘనంగా ప్రజాకవి యోగి వేమన జయంతి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో యోగి వేమన జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర నాయకుడు తిప్పేస్వామి, నాయకులు మాదినేని ఉమామహేశ్వర నాయుడు పాల్గొన్నారు. తలారి రంగయ్య మాట్లాడుతూ కుల మత, ప్రాంతీయ భేదాలు, లింగ వివక్ష లేకుండా ప్రతి మనిషీ మానవీయ విలువలు పాటించాలని వేమన తెలియజేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ ఫణి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు రేవన్న, జిల్లా అధికార ప్రతినిధి గోపురం శ్రీనివాసులు, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తలారి సత్తి, కౌన్సిలర్లు రాము, లక్ష్మన్న, నాయకులు షేక్షా, గోళ్ల సూరి, బోరంపల్లి రామిరెడ్డి, కిరీటి, సోమనాథ్ రెడ్డి, ఉమేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గోళ్ల మోహన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



యోగి వేమన జయంతి నిర్వహిస్తున్న మాజీ ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో ఎస్‌ఎల్‌వీ స్కూల్లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. యోగివేమన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివరాజ్ పాటిల్, లోకేష్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, సోమనాథ్ రెడ్డి, ఉమేష్‌రెడ్డి, రామిరెడ్డి, తిమ్మరెడ్డి, జయపాల్‌రెడ్డి, కృష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై కూటమి వైఖరి తెలపాలి



రాయదుర్గంలోని వినాయక సర్కిల్‌లో సీపీఎం నాయకుల నిరసన



ఉరవకొండలో నిరసన తెలియజేస్తున్న సీపీఐ, కాంగ్రెస్ నాయకులు

రాయదుర్గంటౌన్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అభ్యంతర వ్యాఖ్యలపై కూటమి ప్రభుత్వం వైఖరి తెలియజేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ గో బ్యాక్ అమిత్‌షా అంటూ స్థానిక వినాయక సర్కిల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దేశ్యాప్తంగా అమిత్‌షా తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతున్నా కేంద్రం పట్టించుకోలేదన్నారు. అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, తిమ్మరాజు, నగేష్‌నాయక్, కృష్టానాయక్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

ఉరవకొండ: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తక్షణం రాజీనామా చేయాలని స్థానిక క్లాక్‌టవర్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ, కాంగ్రెస్ నాయకులు ఆదివారం నిరసన తెలియజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోనియా శీనా, ఉపాధ్యక్షుడు బ్యాళ్ల ప్రసాద్ మాట్లాడారు. అంబేడ్కర్ పేరును అనేక సార్లు సంబోధించడం అవసరం లేదని, దానికి బదులు దేవుడి పేరు తలుచుకుంటే స్వర్గం ప్రాప్తి లభిస్తుందని మాట్లాడిన అమిత్‌షాను దేశం క్షమించదన్నారు. కార్యక్రమంలో సీపీఐ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువైద్యశిబిరాలు

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో సోమవారం నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశు వైద్యులు నవీన్‌కుమార్ తెలిపారు. గుమ్మఘట్ట ,మారెంపల్లి, దేవరెడ్డిపల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకా, దూడలకు నట్టల నివారణ, కృత్రిమ గర్భధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బ్రహ్మసముద్రం : మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో రెండు టీంలుగా ఏర్పడి, ప్రతి గ్రామంలోనూ పశువైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం వేపులపర్తి, ఈటకల్లు గ్రామాల్లో పశు వైద్య శిబిరం ఉంటుందన్నారు.

చంద్రబాబూ.. హామీలు నెరవేర్చండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు వెంటనే నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఖలందర్ ఇంటికి మెట్టు వెళ్లారు. ఇటీవల ఖలంధర్ కుమార్తె వివాహం జరిగింది. నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తల్లికి వందనం, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు ఏటా రూ.20 వేలు 19 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 సాయం లాంటి పథకాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్ ఎప్పుడిస్తారని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటానికి సిద్ధంగా ఉందన్నారు. హామీల అమలుపై గట్టిగా పోరాటం చేసి, ప్రజలకు అందేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ ఉషారాణి, కోకుర్తి సర్పంచు భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జయరాం, మాజీ సర్పంచులు పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వేమన, నాయకులు టీఎస్ఎస్ రౌఫ్, హళ్లి నాగరాజు, వేమన, జీహెచ్‌కే సర్మస్, నాగేపల్లి ప్రకాష్, టైలర్ చిక్కణ్ణ, కెంగుట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



బేలోడు వద్ద పొలంలో పూజలు చేస్తున్న మెట్టు

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి

గుమ్మఘట్ట: కాలానుగుణంగా ఏ నేలలో ఏ పంటలు సాగు చేస్తే దిగుబడి సాధించొచ్చో మెలకువలు పాటిస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. మండలంలోని బేలోడు గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో తన కుటుంబ సభ్యులతో కలిసి భూమాతకు (పొలిపూజ) పూజలు చేశారు. ఆయా సీజన్‌లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించొచ్చని ఆయన తెలిపారు. నేల స్వభావాన్ని బట్టి తప్పనిసరిగా పంటల మార్పిడి చేయాలన్నారు.

నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ

కుందుర్పి: మండలంలోని తెనగల్లు, జంబుగుంపల, తూముకుంట గ్రామాల్లోని నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కుసుమగిరి రైతు సంఘం మండల కోఆర్డినేటర్లు తెలిపారు. ఆదివారం ఉచిత శిక్షణపై అవగాహన కల్పించారు. ఒక్కో విడతలో 40 మందికి 3 నెలలు పాటు శిక్షణ ఇచ్చి 75 శాతం సబ్సిడీతో కుట్టు మిషన్లు ఇవ్వనున్నట్లు సంస్థ ఈసీఓ నరసింహమూర్తి తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి



వన్నూరమ్మ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: అనారోగ్యంతో మాజీ సర్పంచు వన్నూరమ్మ (70) ఆదివారం మృతి చెందారు. మండల పరిధిలోని మానిరేవుకు చెందిన వన్నూరమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా కుదుట పడకపోవడంతో ఆదివారం మృతిచెందింది. వన్నూరమ్మ మృతికి వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలియజేశారు. మృతురాలు వన్నూరమ్మకు భర్త పెద్ద కాశన్న, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

బెల్టు షాపులపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: రాయదుర్గం ఎక్సైజ్ పోలీసులు బెల్టుషాపులపై దాడులు నిర్వహించారు. ఆదివారం 'సాక్షి'లో 'ఊరూరా బెల్టు జోరు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు అక్రమ మద్యం అమ్మకాలపై పట్లు చోట్ల దాడులు చేశారు. పట్టణంలోని బీటీపీ కాలనీలో కర్ణాటక, ఏపీ మద్యం విక్రయిస్తున్న పాండురంగ, జాండూ, వడ్డే లక్ష్మీదేవి అనే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. వారి నుంచి 38 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యం సీసాలు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

వంట సామగ్రి వితరణ

కుందుర్పి: బొమ్మలనాయుడు ఈశ్వర ఆలయానికి ఎస్‌ఐ నగేష్, ఎంపీడీఓ లక్ష్మీశంకర్ తదితరులు వంట సామగ్రి, వస్తువులు వితరణ చేశారు. వాటిని ఆదివారం ఆలయ నిర్వాహకులకు అందించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై టీడీపీ వర్గీయుల దాడి

వజ్రకరూరు: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి బెస్త రామాంజనేయులు ఇంటిపై కొందరు టీడీపీ నాయకులు దాడికి దిగారు. కాలనీలో డ్రైనేజీ కాలువ విషయమై బెస్త రామాంజనేయులు ఇంటిపై రాళ్లు, కర్రలతో దాడికి దిగి, ఇంట్లోని వస్తువులను విసిరేసి, సెల్‌ఫోన్ పగులకొట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బెస్త రామాంజనేయులతోపాటు అతని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపైనా టీడీపీ నాయకులు దాడికి పాల్పడినట్లు బాబాధితుడు తెలిపాడు. ఈ ఘటనపై రామాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నాగస్వామి ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు.

దిగుబడి లేక కంది రైతు కుదేలు

కూడేరు: ఖరీఫ్‌లో వర్షాధారం కింద సాగు చేసిన కంది పంటపై రైతులు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. మండలంలోని చోళసముద్రం, జయపురం, కరుట్లపల్లి జల్లిపల్లి, కమ్మూరు,కొర్రకోడు, ఇప్పేరు, గొటుకూరు, బ్రాహ్మణపల్లి, కూడేరు, కలగళ్ల, మరుట్ల, ఉదిరిపికొండ, అరవకూరు, పి.నారాయణపురం, కడదరకుంటతో పాటు మరికొన్ని గ్రామాల్లో వేరుశనగకు ప్రత్యామ్నాయంగా సుమారు 11,000 ఎకరాల విస్తీర్ణంలో రైతులు కంది సాగు చేశారు. కాత బాగుండాలంటే పూత విరబూయాలి. కానీ కంది పంట పూత దశలో తుపాన్ పట్టుకోవడం, వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో పూతకు గూడు పురుగు ఆశించింది. గాలి బలంగా వీయడంతో గూడు పురుగు దెబ్బకు పూతంతా నేల రాలింది. ఆ ప్రభావం కంది దిగుబడిపై చూపింది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కంది పంట సాగు చేసిన రైతులు పంట కోత దశకు రావడంతో కోత కోసే పనుల్లో నిమగ్నమయ్యారు. కానీ ఆశించిన స్థాయిలో దిగుబడి లేదు. సాధారణంగా దిగుబడి బాగుంటే ఎకరాకు 8 క్వింటాళ్ల వరకు వస్తుంది. ప్రస్తుతం 4 క్వింటాళ్ల లోపు వచ్చే అవకాశం ఉంది.



కూడేరు: బ్రాహ్మణపల్లి వద్ద కంది పంట కోత కోసిన దృశ్యం

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ దుర్మరణం

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలి సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఓ పెయింటర్ దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు..బెలుగుప్ప మండలం గంగవరానికి చెందిన పెయింటర్ ముమ్ముళ్ల కృష్ణ (37) అనంతపురానికి చెందిన గోవిందుతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదోనికి బయల్దేరారు. మార్గంమధ్యలో తుగ్గలి వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ ఉన్నపళంగా కదిలి రోడ్డుపైకి వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి గోవిందుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని పత్తికొండకు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పత్తికొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య తిమ్మక్క, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు.